

"రూపాయి మల్లెపూలివ్వు" అన్నాడు నారాయణమూర్తి లాల్చీ జేబులో నించి డబ్బులు బయటకు తీస్తూ

సరిగ్గా అప్పుడే రివ్వున సైకిలు మీద వచ్చి రక్కున ఆగిపోయి సైకిలు దిగి అక్కడకు వచ్చాడు ఒక యువకుడు అతనికి పాతికేళ్ళుంటాయేమో ప్యాంటు జేబులోంచి పర్సు బయటకు తీస్తూ రెండు రూపాయల పూలివ్వు అన్నాడు దుకాణంలో కూర్చున్న ఆడదానితో

మూడు రోజుల్నించి పూలెట్టుకెల్లడం లేదేంటయ్యగారూ అన్నది ఆమె పువ్వులను ఆకులో పొట్లంగా చుడుతూ - అదోలా నవ్వి

ఆ యువకుడు కూడా ముసి ముసిగా నవ్వి ఏం చెప్పమంటావ్? బయట కూర్చుంది అన్నాడు డబ్బులు ఇస్తూ

పువ్వుల పొట్లం తీసుకుని ఆ యువకుడు గబుక్కున సైకిలు ఎక్కి మళ్ళీ రివ్వున వెళ్ళిపోయాడు

కొత్తగా పెళ్ళయిన కుర్రాడిలా వున్నాడనుకున్నాడు వెళుతున్న ఆ యువకుడిని చూస్తూ ఆయనకు ఒక్కసారిగా తనకు పెళ్ళయిన తొలి రోజులు గుర్తుకు వచ్చాయి నారాయణమూర్తికి

పెళ్ళయిన కొత్తల్లో తను కూడా ఇంతే మల్లెపువ్వుల కాలం వచ్చిందంటే సావిత్రి కోసం రోజూ సాయంత్రం బజారునించి పువ్వులు తీసుకెళ్ళేవాడు బయట కూర్చున్న ఆ మూడు రోజులూ మాత్రం పువ్వులు కొనే డ్యూటీ వుండేదికాదు

నవ్వుకున్నాడాయన ఈ మధ్య అంటే దాదాపుగా ఒక నెల రోజుల క్రితంనించి, తను ఆ పువ్వులమ్మే ఆడదాని దగ్గరే రూపాయి మల్లెపూలు రోజూ కొనుక్కొని పోతున్నాడు ఆ దుకాణం ఆడది తను తీసుకెళ్ళే పువ్వులు దేవుడి ఫోటోలకు వెయ్యటానికని అనుకుంటొందేమో కాని రూపాయి పువ్వులు తన అర్ధాంగి సావిత్రి తల్లోకి, జడలోకి అని దానికేం తెలుసు? అనుకున్నాడు

రైలు గేటు దగ్గర • నారాయణమూర్తికి చలమయ్య కనిపించాడు ఆయన తాలూకాఫీసులో హెడ్ క్లర్క్‌గా నౌకరీ చేసి ఆరేళ్ళ క్రితం పదవీ విరమణ చేశాడు ఆయన నారాయణమూర్తి కంటే ఆరు నెల్లు చిన్నవాడు ఆయనకి తలమీద జుట్టు చాలవరకు రాలిపోయింది

అవునూ మీ కొడుకూ కోడలూ ఈ వూర్నించి వెళ్ళిపోయారు కదా ఇంకా ఎవరి కోసం నువ్వు రోజూ పువ్వులు తీసుకెడుతున్నావ్? అనడిగాడు చలమయ్య

నారాయణమూర్తి నవ్వి కోడలు లేకపోతేనేం? సావిత్రి లేదూ? అన్నాడు

అయినా ఇన్ని పువ్వులా? అన్నాడు ఆశ్చర్యంగా

మళ్ళీ నవ్వాడు నారాయణమూర్తి జవాబుగా

ఏమిటీ అరవై అయిదేళ్ళ వయసులో నువ్వు కుర్రాడిగా తయారవుతున్నావా కొంపదీసి అంటూ నవ్వాడు చలమయ్య స్నేహితుడి భుజం మీద చేత్తో తడిమి

వయసులో లేదు - మనసులో నే వుంది అని ఒక కవి అన్నాడు సర్లే వస్తాను మళ్ళీ కలుద్దాం అని అక్కడినించి కదిలాడు ఆయన

అప్పుడే ఏడు గంటలు దాటుతోంది కొంచెం దూరంలో వున్న పార్కులో రేడియోలో వార్తలువస్తున్నాయి

వీధి దీపాలు మసగ్గా వెలుగుతున్నాయి అప్పటికే చంద్రుడు ఆకాశం మీదికి వచ్చాడు వెన్నెల వెలుగు అంతటా పరచుకుంది

అరవై ఐదేళ్ళ నారాయణమూర్తికి హుషారుగా వుంది ఇంటి దగ్గర తన భార్య సావిత్రి ఒంటరిగావుంటుంది అనే ఆలోచన ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది

ఆయన గబగబా నడిచి ఇల్లు చేరాడు వెళ్ళేసరికి ఆయన భార్య సావిత్రమ్మ వరండాలో కూర్చుని వుంది పడక్కుర్చీలో రోడ్డు మీదకు చూస్తూ

ఆయన్ని చూస్తూనే నిలబడింది పువ్వుల పొట్లాన్ని భార్యకు ఇచ్చాడు

సావిత్రమ్మ నవ్వుతూ గుర్తుంచా మీరు బజారుకు వెళ్ళేటప్పుడు గుర్తుచెయ్యటం మరచిపోయాను అన్నది

మన పెళ్ళయిన కొత్తల్లో కూడా నువ్వు రోజూ చెప్పేదానివా సావిత్రీ రోజూ నేనే తీసుకు వచ్చేవాడిని ఆ అలవాటు మరచిపోయి ఎన్నేళ్ళయ్యిందో అన్నాడాయన

ఇద్దరూ పక్క పక్కనే భోజనానికి కూర్చున్నారు

ఒకరికొకరు వడ్డించుకుంటూ భోజనాలు ముగించారు మధ్య గదిలో సిద్ధంచేసి వున్న డబుల్ కాట్ బెడ్ మీద వెళ్ళి కూర్చున్నాడు నారాయణమూర్తి ఆ మంచం పెద్ద కొడుకుది సామానంతా నెల రోజుల క్రితం తనకు బదిలీ అయిన వూరుకు తీసుకువెళ్లాడు కాని ఆ డబుల్ కాట్‌ని అక్కడే వుంచాడు తర్వాత ఎప్పుడో వచ్చి తీసుకెళతానన్నాడు

పక్కమీద బీరువాలో వున్న కొత్త గళ్ళ దుప్పటి పరిచింది సావిత్రమ్మ

వంటిల్లు సర్ది పళ్ళెంలో ఆకులు, వక్కలు, సున్నం తీసుకువచ్చింది సావిత్రమ్మ భర్త పక్కనే కూర్చుని కబుర్లు చెబుతూ తమలపాకులు చుట్టి ఇచ్చింది

గదిలో లైటు వెలుగుతోంది

ఆకులు వేసుకున్న తరువాత ఆమె మంచం పక్కగా వున్న టేబిలు మీది ఫోటో ఆల్బమ్‌ను తీసింది అది నలభైయేళ్ళ క్రితం ఆల్బమ్ అందులో నారాయణమూర్తి, సావిత్రమ్మల ఫోటోలు వున్నాయి నెలరోజులుగా ఆ ఆల్బమ్ అక్కడే వుంటోంది రోజూ పడుకోబోయే ముందు ఒక్కసారయినా ఆ దంపతులిద్దరూ తమ పెళ్ళినాటి ఫోటోలను, ఒకప్పటి వాళ్ళ వయసు అందచందాలను చూసుకుని మురిసిపోతున్నారు

భార్య పక్కనే నిలబడి వున్న ఫోటోని చూస్తూ మళ్ళీ ఆ రోజులు, ఆ ఆనందం, ఆ హుషారు ఈ జన్మకు తిరిగిరావు కదా సావిత్రి ఈ ఫోటోల్ని చూస్తుంటే కాలం పెరిగే వయసూ మనుషుల రూపాలను ఎంతగా మార్చేస్తాయో తెలుస్తోంది అన్నాడాయన అదోలా

నాకు మాత్రం ఇప్పటికి మీలో అప్పటి రూపమే కనపడుతోంది పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు మీరెట్లోవున్నారో, ఏ ప్యాంటు షర్టు వేసుకున్నారో నాకు ఇప్పటికీ కూడా గుర్తుంది అన్నది సావిత్రమ్మ

నిజంగానా? అన్నాడు నారాయణమూర్తి ఆశ్చర్యంగా

అవును నాకు అన్నీ బాగానే గుర్తున్నాయి అన్నదామె

భార్యను ప్రేమగా, ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడాయన

తల్చుకుంటే ఇప్పుడు ఎంతో దిగులుగా వుంది సావిత్రీ మనం జీవితంలో చాలా పోగొట్టుకున్నాం

ఆ వెలితి ఏమిటో ఇప్పుడు నీతో ఇలా దగ్గరగా మసలుతూ వుంటే అర్థమవుతోంది అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ

బాధపడకండి మీరు తక్కువ వయసులోనే బాధ్యతల సుడి గుండంలో చిక్కుకుపోయారు కనీసం ఇప్పుడయినా ఈ జారిపోయే వయసులో నైనా మీరు తృప్తిగా వుండగలిగితే అంతే చాలు ఇంకా నయం ఇప్పటికైనా, ఇన్నాళ్ళకైనా మనిద్దరం కలిసి వుంటూ ఒకరి మనసులో మాటను ఒకరు చెప్పుకునే అవకాశం కలిగింది అన్నది సావిత్రమ్మ

అవును నన్ను పెళ్ళి చేసుకుని నువ్వు కూడా బాగా నష్టపోయావు సావిత్రీ ఈ విషయమే నాకు బాధను కలిగిస్తోంది విచారంగా అన్నాడాయన

గతించిన రోజుల్ని తల్చుకుని, బాధపడకండి కనీసం ఈ వయసులో అయినా మనం తృప్తిగా వుందాం' అన్నది సావిత్రమ్మ

కొంచెం సేపటి తర్వాత ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు

సావిత్రమ్మకి వయసు తక్కువకాదు అరవై ఒక్క ఏడు భర్తకంటే నాలుగేళ్ళు చిన్నది వాళ్ళిద్దరి పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా ఆ ఇద్దరినీ చూసి జంట బావుందని అనుకున్నారు కొంతమందికి వయసు వచ్చినకొద్దీ లావుగా మారిపోతారు కాని సావిత్రమ్మ లావు కాలేదు సన్నగానే వుంది నారాయణమూర్తిలో కూడా వయసు, వృద్ధాప్యం తెచ్చిన మార్పులు తప్పించి మామూలుగానే వున్నాడు

నెల రోజుల నించీ వాళ్ళిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిపోయింది నెల రోజుల క్రితం వరకూ వాళ్ళ పెద్దకొడుకు, కోడలు, ముగ్గురు పిల్లలూ అక్కడే వున్నారు అతని పేరు ప్రకాశం బ్యాంకులో ఉద్యోగం నెల క్రితమే తెనాలికి బదిలీ అయ్యింది అంతా ఆ ఇంట్లోంచి వెళ్ళిపోయారు ఆరు నెల్ల క్రితమే రెండో కొడుకు సుందరానిక్కూడా హైదరాబాద్‌లో ఒకప్రయివేటు కంపెనీలో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు అప్పుడు ఆ ఇంట్లో ఇద్దరే మిగిలిపోయారు

నారాయణమూర్తికి పెళ్ళయిన రెండేళ్ళకే తల్లీ, తండ్రీ ఒక బస్సు ప్రమాదంలో చనిపోయారు అప్పుడే కుటుంబ భారమంతా ఆయన మీద పడిపోయింది అప్పటికే తాలూకా ఆఫీసులో ఉద్యోగం రావటం వల్ల కుటుంబం బజారున పడకుండా సరిపోయింది ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు బాధ్యతను పూర్తిగ తనే వహించాడు తమ్ముళ్ళకు చదువులు చెప్పించాడు చెల్లెలు పెళ్ళి చేశాడు వాళ్ళ బాధ్యత తీరిందనుకునేసరికి నారాయణమూర్తికి తను కన్న సంతానం ఇద్దరు మగపిల్లలూ, ఇద్దరు ఆడ పిల్లలూ ఎదుగుతూ వచ్చారు వీళ్ళందరినీ పెంచి పెద్ద చేయటంలో నారాయణమూర్తి, సావిత్రమ్మ బాగా అలసిపోయారు

ఇంటి నిండా ఎప్పుడూ మనుషులు నారాయణమూర్తి సంపాదించటంతోనూ, కుటుంబ అవసరాలు తీర్చటంలోనూ సతమతమయిపోతే సావిత్రమ్మ ఇంట్లో మనుష్యులకు వండి పెట్టటంలోనూ, వాళ్ళ అవసరాలు తీర్చటంతోనూ అలిసిపోయింది

ఇన్నేళ్ళ వరకూ ఆ దంపతులిద్దరికీ ఒకే ఇంట్లో వుంటున్నా అనోన్యంగా మాట్లాడుకోటానికిగానీ, మనసు విప్పి మాట్లాడుకోటానికిగానీ అవకాశమే కలగలేదు ఏకాంతాన్ని ఎప్పుడో మరిచిపోయారు యాంత్రికంగానే సంసారం చేసారు ఎన్నో యేళ్ళతో ఏకాంతంగా కలుసుకునే అవకాశాలు చాల తక్కువగానే లభించాయి

యవ్వనం ఇద్దరికీ బాధ్యతల మధ్య పడి నలిగిపోయింది కరిగిపోయింది హారతి కర్పూరంలా

ఎంతో ఆనందాన్ని అనుభవించవలసిన కాలం సాదాగా చాలా మామూగా గడిచిపోయింది దీని తాలూకు అసంతృప్తి ఇద్దరిలోనూ పూర్తిగా నిండిపోయింది

పెద్దకొడుకు పెళ్ళయ్యింది ఇద్దరు కూతుళ్ళకీ పెళ్ళిళ్ళు అయ్యాయి మళ్ళీ వాళ్ళందరికీ నోములు వ్రతాలు పురుళ్ళూ అంటూ ఎప్పుడూ ఇంటికి వస్తూనే వున్నారు వాళ్ళు రావటం తగ్గించేసరికి పెద్దకొడుక్కి ఆ వూరికే బదిలీ అయ్యింది కుటుంబంతో వచ్చేశాడు అప్పటికి రెండోవాడు చదువు పూర్తిచేసుకుని ఉద్యోగం లేక ఇంట్లోనే ఉన్నాడు

ఆరు నెల్ల క్రితమే సుందరానికి ఉద్యోగం వచ్చి హైదరాబాద్ వెళ్ళిపోయాడు ప్రకాశం తెనాలి వెళ్ళిపోయాడు

పెద్దకొడుకు బదిలీ మీద కుటుంబంతో ఇంకో వూరు వెళ్ళిపోతున్నప్పుడు బాద కలిగినా ఈ వయసులో ఐనా తిరిగి ఏకాంతం దొరుకుతోందనీ, ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందనీ అనుకున్నారు వాళ్ళు

వాళ్ళంతా వెళ్ళిపోయిన రోజు ఇద్దరికి ఏమి తోచలేదు ఇల్లంతా బోసిపోతున్నట్లుగా ఏదో వెలితిగా అనిపించింది రెండు మూడు రోజులకు ఆ ఇంట్లో వాళ్ళిద్దరూ వుండటానికి అలవాటుపడ్డారు

ఈ నెల రోజుల్లోనూ ఆ వృద్ధ దంపతుల మధ్య అన్యోన్యత బాగా పెరిగిపోయింది సావిత్రమ్మ భర్తకు ఇష్టమైన వంటలన్నీ చేసి పెడుతోంది

నారాయణమూర్తి రోజూ భార్యతో కలసి సాయంత్రం వేళ బయటకు వెళుతున్నాడు ఈ నెల రోజుల్లోనూ భార్యతో కలసి ఆయన నాలుగు సినిమాలు చూశాడు

కళామందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలకు సంగీత కచేరిలకు తీసుకువెళ్లాడు మేజిక్ షోకు తీసుకువెళ్లాడు చాలాసార్లు పార్కుకు కూడా తీసుకువెళ్లాడు

పార్కులోకి వచ్చే మనుషులు నారాయణమూర్తినీ, సావిత్రమ్మనీ వింతగా చూశారు సాదారణంగా పార్కులకు వయసులో వున్న జంటలు తప్పించి వృద్ధ దంపతులు ఎక్కువగా రారు

ఒక్కోసారి సినిమాకు వెళ్ళి తిరిగివస్తూ హోటల్లోనే ఇద్దరూ భోజనం చేసి కిళ్ళీ వేసుకుని ఇంటికి వచ్చేవాళ్ళు

మళ్ళీ మీరు రంగుల చొక్కాలు వేసుకుంటే చూడాలని వుంది ఆ రోజుల్లో మీరు పువ్వుల చొక్కాలు గళ్ళ చొక్కాలు వేసుకుని ఎంతో దర్జాగా వుండేవాళ్ళు అన్నది సావిత్రమ్మ ఒక రోజు

ఆ రోజు సాయంత్రం భార్య కోరిక మీద బట్టల షాపుకువెళ్లాడు నారాయణమూర్తి సావిత్రమ్మతో

రెండు రంగుల షర్టులను సెలక్టు చేసింది ఆమె తర్వాత ఆమెకి ఒక పువ్వులున్న పట్టు చీరను కొనిపెట్టాడు ఆయన

ఈ షర్టులు వేసుకుంటే ఎవరైనా నవ్వుతారేమో అన్నాడాయన తిరిగివస్తూ

ఎవరు నవ్వేది? నాకు చూడాలని వుంది నాకోరిక తీర్చండి ఎవరి ఇష్టం వారిది మీరు పూలున్న పట్టు చీర కొన్నారు ఎవరో నవ్వుతారని నేను వద్దన్నానా? అన్నది ఆమె

నెల రోజులుగా ఆ వృద్ధ దంపతుల ప్రవర్తనలో వచ్చిన మార్పును ఆ వీధిలో వున్న వాళ్ళంతా గుర్తించారు ఆశ్చర్యపోయారు ఈ వయసులో వీళ్ళు కొత్త భార్యాభర్తల్లా వుంటున్నారేమిటి? అనుకున్నారు ఇద్దరూ దాదాపుగా రోజూ జంటగా అలంకరించుకుని షికార్లకు బయల్దేరటం చాలామందికి వింతగా తోచింది

ఇంతకుముందు తలదువ్వుకోకుండా జుట్టు రేగి ముడిపెట్టుకుని వుండే సావిత్రమ్మ ఇప్పుడు తల దువ్వుకుని జడలేసుకుని ముడిపెట్టుకుంటోంది ఎప్పుడూ ఎంతో శుభ్రంగా కడిగిన ముత్యంలా వుంటోంది

ఎన్నో యేళ్ళుగా ఎదురు చూసిన ఏకాంతం ఇద్దరికి ఇప్పటికి దొరికింది తమ జీవితాలు

పడమట సంధ్యారాగం

పడమటికి వాలిపోతున్నాయని ఈ వయసులో ఐనా మిగిలిన ఈ కొద్ది జీవితకాలంలో ఐనా భార్యాభర్తలుగా స్నేహితుల్లా సన్నిహితంగా కలిసి వుండాలని వాళ్ళు తాపత్రయపడుతున్నారు

చూసేవాళ్ళకు అసహజంగా వున్నా వాళ్ళ జీవితాల్లో వున్న తపన చాల సహజమైనదే ఇంకొకరు తమ గురించి ఏమనుకుంటున్నారో అనే ధ్యాస వాళ్ళలో లేదు

ఆ రోజు పోస్టులో పెద్దకొడుకు ప్రకాశం దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది

అందులో ప్రకాశం ఇలా రాశాడు

నాన్నకు నమస్కరించి వ్రాయునది-

ముఖ్యంగా - నాన్నా, మన వూళ్ళో వున్న బ్యాంకులో పని చేసే సూర్యారావుకు ఈ వూరుకు ట్రాన్సఫర్ కోసం ప్రయత్నం చేస్తున్నాడు ఈ టైములో నేను గట్టిగా ప్రయత్నం చేస్తే మన వూరుకు బదిలీ అవుతుంది నేను మన వూరుకు బదిలీ గురించి ప్రయత్నం చేద్దామనుకుంటున్నాను నువ్వు అమ్మ అక్కడే వుండదల్చుకుంటే నేను బదిలీ కోసం గట్టి ప్రయత్నం చేస్తాను లేకపోతే ఇక్కడే వుంటాను మీరు కూడా ఈ వయసులో ఒంటరిగా అక్కడ ఎందుకు? ఇక్కడకే వచ్చి వుండండి ఏ విషయం నువ్వు వెంటనే నాకు తెలియజెయ్యి నీ జవాబు కోసం ఎదురు చూస్తుంటాను

ఆ ఉత్తరాన్ని చదవగానే నారాయణమూర్తి కంగారుపడ్డాడు కొడుకు ట్రాన్స్‌పర్ చేయించుకుని వచ్చాడంటే తనకి భార్యకి మధ్య దూరం మళ్ళీ పెరుగిపోతుంది వాళ్ళని బదిలీ చేయించుకుని ఇక్కడకు రావద్దని రాయడం బావుండదు అలా రాయకపోతే తమనే వచ్చి అక్కడే వుండమని బలవంతపెడతాడు సావిత్రితో అక్కడికి వెళ్ళటం కూడా తనకు ఇష్టంలేదు

ఇప్పుడేం చెయ్యాలి? ఆలోచనలో పడిపోయాడు నారాయణమూర్తి

సావిత్రమ్మకి కూడా ఈ విషయం గురించే దిగులు పట్టుకుంది

ఆయన వెంటనే కొడుక్కి ఉత్తరం రాయలేదు

వారం రోజుల తర్వాత ఈ విషయం గురించి వెంటనే తండ్రితో మాట్లాడి రమ్మని భార్య శ్యామలను పంపించాడు ప్రకాశం

శ్యామలను నవ్వుతూ ఆహ్వానించింది సావిత్రమ్మ తనెందుకు వచ్చిన కారణం యేమిటో వాళ్ళతో చెప్పింది శ్యామల వాళ్ళిద్దరూ మాట్లాడలేదు

తర్వాత కొంచెం సేపటికే అత్తగారిలో మామగారిలో వచ్చిన మార్పును గమనించి నిర్ఘాంతపోయింది శ్యామల

పక్కింటివాళ్ళు కూడా ఆ వృద్ధ దంపతుల వింత ప్రవర్తన గురించి వాళ్ళ అన్యోన్యత గురించి వివరంగా శ్యామలతో చెప్పారు

తన భర్త బదిలీ గురించి రాసిన ఉత్తరానికి మామగారు జవాబు ఎందుకు రాయలేదో అప్పుడు శ్యామలకు బాగా అర్థమయ్యింది

ఒక రోజు ఉండి తెల్లవారి ఉదయం ఇక నేను వెళతాను అన్నది శ్యామల

ఆ విషయంలో ఇంకా మేము ఏదీ నిర్ణయించుకోలేదమ్మాయ్ వాడితో ఈ మాటే చెప్పు తర్వాత నాలుగైదు రోజుల్లో ఉత్తరం రాస్తాను అన్నాడు నారాయణమూర్తి కోడలితో

శ్యామల వెళ్ళిపోయింది

వాడు బదిలీ ప్రయత్నం చేస్తాడేమో అన్నది సావిత్రమ్మ భర్తతో

ఏమో తెలీదు ఇంతకీ వాళ్ళు మళ్ళీ ఇక్కడికి రావడం నీకు అంగీకారమేనా సావిత్రీ? అడిగాడు నారాయణమూర్తి

కొడుకు కోడలు మనపళ్ళ మీదనాకు అంతులేని ప్రేమ, మమకారం ఉన్నాయి కాని ప్రస్తుతం వాళ్ళకు నా ప్రేమతో పనిలేదు ఈ వయసులో నాకు సన్నిహితంగా వుండాల్సిన మనిషిగా మిమ్మల్నే కోరుకుంటాను ఈ విషయం మీకు మాత్రం తెలీదా? అన్నది ఆమె

నిజమే మన పిల్లలు మన మనసును తెలుసుకోవాలి కదా వాళ్ళ దృష్టి, ఆలోచనలు వేరుగా వుంటాయి ఇంత వయసులో కూడా అమ్మ నాన్న పని చేసుకుంటూ కష్టపడటం ఎందుకు? మన దగ్గరే వుంటే సరిపోతుంది కదా అనుకుంటారు ఇది సహజం సావిత్రీ అన్నాడాయన

చూద్దాం అంతగా వాళ్ళు ఇక్కడికి వచ్చినా, మనల్ని అక్కడకు రమ్మని బలవంతపెట్టినా చెయ్యగలిగింది ఏదీలేదు అన్నది ఆమె

కోడలు శ్యామల వెళ్ళిన మూడో రోజున ఉత్తరం వచ్చింది కొడుకు ప్రకాశం ఇలా రాశాడు

నాన్నకు నమస్కరించి వ్రాయునది

ముఖ్యంగా - నాన్నా ప్రస్తుతం నాకు ఇక్కడ బాగానే వుంది నేను అక్కడకు బదిలీ కోసం ప్రయత్నం చెయ్యటంలేదు మీరిద్దరూ ఎప్పుడు రావాలనుంటే అప్పుడు ఇక్కడకు వచ్చెయ్యండి-

ఆ ఉత్తరం చదవగానే ఇద్దరూ తేలిగ్గా నిట్టూర్చారు ఆ వృద్ధ దంపతుల హృదయాల్లో తిరిగి సంతోషం ఆనందం చోటు చేసుకున్నాయి □